# కాట్రపల్లి కొత్త సచివాలయం రెడీ



సకల హంగులతో నిర్మించిన కాట్రపల్లి గ్రామపంచాయతీ నూతన భవనం

- సకల సౌలతులతో నిర్మాణం
- మండలివిప్ పాడికౌశిక్‌రెడ్డి చేతుల మీదుగా నేడు ప్రారంభం
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

హుజూరాబాద్, అక్టోబర్ 3: మండలంలోని కాట్రపల్లిలో కొత్త సచివాలయం సిద్ధమైంది. ఏనాడో తాతాల కాలం నాడు నిర్మించిన గ్రామ పంచాయితీ భవనం శిథిలావస్థకు చేరుకోగా...దానిని కూల్చివేసి కొత్త భవనం నిర్మించారు. అన్ని హంగులతో నిర్మించిన ఈ భవనాన్ని మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. గ్రామ పాలనకు కేంద్ర బిందువైన పంచాయతీ కొత్త భవనం నిర్మాణంతో గ్రామస్తుల కల సాకారమైంది.

**సకల సౌలతులతో నిర్మాణం**

శిథిలావస్థలో ఉన్న భవనంలో సమావేశాలు, ఇతరాత్ర కార్యక్రమాలు నిర్వహించడానికి పాలకవర్గం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలుగు చినుకులు పడితే జలజల నీళ్లు జారడంతో కార్యాలయంలో కూర్చొనే పరిస్థితి ఉండేది కాదు. పాత గ్రామ పంచాయతీ భవనంలో వెంటిలేటర్ సరిగా ఉండేది కాదు. అస్తవ్యస్తంగా ఉన్న టాయిలెట్స్‌తో అధికారులు, పాలకవర్గం అవస్థలు పడ్డారు. కొత్త గ్రామ సచివాలయాన్ని సకల సౌలతులతో నిర్మించారు. మొత్తం రూ. 25 లక్షలు భవన నిర్మాణానికి కాగా ఇందులో రూ. 20 లక్షలు ఈజీఎస్ నిధులు, రూ.5 లక్షలు గ్రామ పంచాయితీ నిధులు వెచ్చించారు.

**ఆరు కొత్త భవనాలు**

మండలంలో 19 గ్రామపంచాయతీలు ఉండగా అందులో పూర్తిగా శిథిలావస్థలో ఉన్న కాట్రపల్లి, రాంపూర్, రంగాపూర్, జూపాక, పోతిరెడ్డిపేట, బొత్తలపల్లి జీపీలకు నూతన భవనాలు నిర్మించడానికి బీఆర్ఎస్ సర్కారు జనవరిలో పచ్చ జెండా ఊపింది. సకల సదుపాయాలతో నూతన గ్రామ సచివాలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ కింద రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయగా... ఈమేరకు పనులు ప్రారంభమయ్యాయి. కాట్రపల్లి గ్రామ పంచాయతీ కొత్త భవనం ప్రారంభానికి సిద్ధం కాగా... మండలంలోని మిగతా గ్రామాల్లో జీపీల నిర్మాణం కొనసాగుతున్నది. జీపీలు కొత్త రూపురేఖలు సంతరించుకుంటుండడంతో ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**దశాబ్దాల కల నెరవేరింది**



నూతన పంచాయతీ భవనం నిర్మిండంతో గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరనుంది. నిధుల మంజూరుకు కృషి చేసిన మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. దేశానికి పట్టుకొమ్మలైన పల్లెలు బాగుండాలనే సదుద్దేశంతో బీఆర్ఎస్ సర్కారు గ్రామసచివాలయం నిర్మించడం అభినందనీయం.

**-కాసగోని నిరోష, సర్పంచ్ (కాట్రపల్లి)**

**సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం**



గ్రామాలు బలోపేతంగా ఉంటేనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పటుత్వంగా ఉంటాయి. దీనికి తగ్గట్టుగా గ్రామపాలనకు కేంద్రబిందువైన పంచాయతీల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నది. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు నిర్మించడం హర్షణీయం.

**-ఇరుమళ్ల రాణి, ఎంపీపీ**

# అనాథాశ్రమానికి విజ్ఞాన్ నెక్ట్ స్జెన్ విద్యార్థుల చేయూత

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 3: హుజూరాబాద్ పట్టణంలోని విజ్ఞాన నెక్ట్‌స్జెన్ పాఠశాల విద్యార్థులు బాలల సంరక్షణ సంస్థకు తమ వంతుసాయం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పోచంపల్లి రాజయ్య ఫౌండర్‌గా ఉన్న మంథని డివిజన్ హ్యాండీక్యాప్ వెల్ఫేర్ సొసైటీ, గోదావరిఖని సభ్యులైన రవణమ్మ, గాయత్రిని పాఠశాలకు పంపించగా విజ్ఞాన్ నెక్ట్‌స్జెన్ పాఠశాల యాజమాన్యం, పిల్లలు కలిసి రూ. 8,044 వెల్ఫేర్ సొసైటీకి పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ అనాథలని ఆదుకున్నందుకు విద్యార్థులు, పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్కువ మొత్తం కలెక్ట్ చేసిన విద్యార్థులను మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తిరుపతియాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సొసైటీ సభ్యులకు నగదు అందజేస్తున్న విజ్ఞాన్ నెక్ట్ స్జెన్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

# రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 3: సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపుమేరకు మంగళవారం హుజూరాబాద్ పట్టణంలో తెలంగాణ రైతు సంఘం హుజూరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జోన్ కమిటీ నాయకుడు వెల్మరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని లకీంపూర్‌కేర్ రైతులు శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తుండగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా తన కారుతో ఢీకొట్టి నలుగురు రైతులు, ఒక విలేకరిని పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హోమ్ శాఖ సహాయ మంత్రిని వెంటనే పదవినుంచి తొలగించాలన్నారు. రైతులకు రాత పూర్వకంగా ఇచ్చిన హామీలు, స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయాలని, రైతులు పండించిన ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం ధర కలిపి మద్దతు ధర నిర్ణయం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, రైతులపై పెట్టిన కేసులను ఉప సంహరించుకోవాలని, పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండేడి వాసుదేవ్, జిల్లా నాయకులు కదిరే రమేశ్, కొంకటి చంద్రయ్య, లింగయ్య, సుధాకర్, రమేశ్, చిరంజీవి, రవి, కనకరాజు, బాలకృష్ణ, మోర మహేశ్, మల్లమర్రి రవి, పల్లపు ప్రశాంత్, దాట్ల రత్నాకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.



కనపర్తిలో బొంగోని కార్తీక్ ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

# బాధిత కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

- మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి
- బాధిత కుటుంబాలకు పరామర్శ

వీణవంక, అక్టోబర్ 3: బాధిత కుటుంబాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందని మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి భరోసా కల్పించారు. మండలంలోని కనపర్తి గ్రామంలో మంగళవారం పలు బాధిత కుటుంబాలను స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. కనపర్తికి చెందిన బొంగోని కార్తీక్‌గౌడ్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి భరోసా కల్పించారు. అదే గ్రామానికి చెందిన కోల రాజయ్య అనారోగ్యానికి గురి కాగా ఆయనను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఇక్కడ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, సర్పంచ్ పర్లపెల్లి రమేశ్, నాయకులు తిరుపతి, శశికుమార్, చరణ్ తదితరులు ఉన్నారు.

# ఈద్గాకు స్థలం కేటాయింపు హర్షణీయం

- మంత్రులు కేటీఆర్, గంగులకు రుణపడి ఉంటాం
- ఎన్నికల్లో బండి సంజయ్ ఓటమే ధ్యేయంగా పనిచేస్తాం
- ఎంఐఎం నగరాధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్

కలెక్టరేట్, అక్టోబర్ 3: నగరంలోని ముస్లింలు పండుగ వేళల్లో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా కొత్తపల్లి హవేలీలో స్థలం కేటాయించడం హర్షణీయమని ఎంఐఎం నగరాధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. ముస్లింల సంక్షేమాన్ని కాంక్షిస్తున్న మంత్రులు కేటీఆర్, గంగుల, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నగరంలోని దారుసలేంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లోని ముస్లింల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మంత్రి గంగుల, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపుకోసం కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం సమాజం బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. నగరంలో బండి సంజయ్ ఏ ఎన్నికల్లో పోటీ చేసినా ఆయన ఓటమే ధ్యేయంగా ఎంఐఎం పనిచేస్తుందన్నారు. మిలాద్ ఉన్ నబీ అంశాన్ని ఎంఐఎంకు ముడిపెట్టి, ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేందుకు పన్నిన కుట్రలను పోలీసులు ఛేధించారని తెలిపారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఈద్గాకు స్థలం కేటాయింపుపై దారుసలేంలో మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, నాయకులు కమ్రుద్దీన్, ఖాజా, అబ్బాస్ షమీ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తిమ్మాపూర్, అక్టోబర్3: సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఇంద్రానగర్ లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. మనువాదం ముసుగులో దుండగులు చేసిన ఇలాంటి చర్యల వల్ల బహుజన వాదం మరింత బలపడుతుందని స్పష్టం చేశారు. దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాటిక వినోద, సంఘం మండలాధ్యక్షుడు పారునంది జలపతి, జిల్లా ఉపాధ్యక్షుడు వంతడ్పుల సంపత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యస్వామికి ఫల పంచామృతాభిషేకం

కరీంనగర్ రూరల్: అక్టోబర్ 3: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో కొలువై ఉన్న ఉమాసుతుడైన శ్రీ వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామివార్లకు మంగళవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణశర్మ ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ వంగళ లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.